
# సాక్షి హనుమకొండ

మంగళవారం | 18 ఫిబ్రవరి | 2025



**పర్యాటకులకు గుడ్ న్యూస్**

పర్యాటకులను ప్రోత్సహించేందుకు తెలంగాణ టూరిజం ఒక్కరోజు పర్యాటక ప్రాంతాల సందర్శన టూర్ ఏర్పాటు చేసింది. - 8లో



**ఆన్‌లైన్.. ఆగమాగం**

రైల్వే శాఖలో పనిచేసే కార్మికుల కనీస హక్కులను ఆన్‌లైన్ చేయడంతో వాటిని వినియోగించుకోలేక పోతున్నారు. - 8లో




**వాతావరణం**

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఉక్కపోత ఉంటుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### కంటి పరీక్షల శిబిరం ప్రారంభం

ఎంజీఎం : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దృష్టిలోపం గుర్తించిన 2,334 విద్యార్థులకు రీస్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ, చికిత్స అందించేందుకు వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కంటి పరీక్షల శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య ఆదేశాల మేరకు ఎనిమిది రోజుల పాటు రోజుకు 300 మంది విద్యార్థుల చొప్పున కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ మహేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయకుమార్, రీజనల్ కంటి ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు దుర్గాప్రసాద్, కుమారస్వామి, ప్రదీప్‌రెడ్డి, రవీందర్, ఆప్తాలమిక్ అధికారులు రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

### 105 మంది విద్యార్థినులకు ప్రాంగణ నియామకాలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఫైనలియర్ విద్యార్థినులు 105 మంది వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. ఇన్ఫోసిస్‌లో ఇద్దరు, డిజిగీక్స్‌లో ముగ్గురు, జెన్‌పాక్ట్‌లో 35 మంది, డెల్టీవీఎస్‌లో 18 మంది, క్యూస్పైడర్‌లో 33 మంది, పెంటగాన్ స్పేస్‌లో 10 మంది, ఎకోట్రైన్స్‌లో నలుగురు ఎంపికయ్యారని, వీరికి వార్షిక వేతనం రూ.3.2 లక్షల నుంచి రూ 4.5 లక్షల వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. జూన్‌లో జాయినింగ్ అవుతారు. మధ్యలో ఇంటర్న్‌షిప్ ఉంటుందని వివరించారు. ఈమేరకు సోమవారం కేయూ సెనెట్‌హాల్‌లో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం విద్యార్థినులను అభినందించారు. కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### జైళ్లశాఖ డీజీపీని కలిసిన సీపీ



వరంగల్ క్రైం: రాష్ట్ర జైళ్లశాఖ డీజీపీ సౌమ్య మిశ్రాను వరంగల్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా సౌమ్యమిశ్రా వరంగల్ నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందజేసి స్వాగతం పలికిన సీపీ కొంతసేపు ముచ్చటించారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏఎస్పీ మనన్ భట్, ఏసీపీలు వెంట ఉన్నారు.

### వరంగల్ నగరానికి 100 ఎలక్ట్రిక్ బస్సులు

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగరానికి 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. నివేదిక సమర్పించాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టరేట్ డాక్టర్ టీకే.శ్రీదేవి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్, ఆర్టీసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ భారత ప్రభుత్వం 'పీఎం ఈ-బస్ సేవా పథకం'లో భాగంగా వరంగల్ నగరానికి జనాభా ప్రాతిపదికన 100 ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహణ కోసం బల్దియాకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీతో పాటు ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, హనుమకొండ వరంగల్ జిల్లాలకు చెందిన రవాణా శాఖ అధి కారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పా రు. ప్రతిపాదనలు పంపిస్తే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. వీసీలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బాలు నాయక్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, వరంగల్ ఆర్టీఓ శోభన్‌బాబు, హనుమకొండ ఆర్టీఓ వేణు గోపాల్, బల్దియా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, బల్దియా ఈఈ మహేందర్ పాల్గొన్నారు.

# 'తరగతి గది'లో డిజిటల్ విప్లవం

- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులతో బోధన
- విద్యార్థికి అభ్యాసం–ఉపాధ్యాయుడికి సులభతరం
- జిల్లాలోని 160 సర్కారు స్కూళ్లలో 444 బోర్డులు
- 1,326 మంది టీచర్లకు పూర్తయిన శిక్షణ



విద్యారణ్యపురి: ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేయడానికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు(ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవం వచ్చిందనడంలో అతిశయోక్తిలేదు. ఈ సదుపాయం ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. కొంత కాలం క్రితమే వీటిని పాఠశాలల్లో ఏర్పాటు చేసినప్పటికీ వాటి వినియోగంపై ఉపాధ్యాయులకు స్పష్టత లేకపోవడంతో ఇటీవలే అవగాహన కల్పించారు.

### ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లాలోని 160 పాఠశాలల్లో 444 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను కొంతకాలం క్రితమే ప్రభుత్వం మంజూరు చేయగా ఇన్‌స్టాల్ చేశారు. అయితే వీటిపై ఉపాధ్యాయులకు సరైన అవగాహన లేకపోవడం.. ఆపరేటింగ్ తెలియక.. సమగ్రంగా వినియోగించుకోలేకపోతున్నారు. దీనిని గమనించిన ప్రభుత్వం హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లందరికీ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లపై శిక్షణ ఏర్పాటు చేసింది. ఒక రోజు శిక్షణ శనివారంతో ముగిసింది. శిక్షణలో 123 మంది హెచ్‌ఎంలతోపాటు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, ఫిజికల్‌సైన్స్, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, లాంగ్వేజ్ పండిట్లు, ఉర్దూ ఉపాధ్యాయులు 1,203 మంది మొత్తం 1,326 మంది ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో 14 మంది రిసోర్స్ పర్సన్లకు రెండు రోజులు శిక్షణ ఇవ్వగా.. వారి ద్వారా జిల్లాలో సబ్జెక్టుల వారీగా మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులను గుర్తించి 196 మందికి జిల్లా స్థాయి శిక్షణ ఇచ్చారు. వీరు కాంప్లెక్స్ స్థాయిలో సబ్జెక్టు టీచర్లకు మూడు రోజులపాటు శిక్షణ అందజేశారు.

### ఐఎఫ్‌పీ అవసరం ఏమిటంటే..

విద్యాబోధనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం – తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో ఐఎఫ్‌పీ బోర్డులను తరగతి గదుల్లో ఏర్పాటు చేసి వాటి లోపల ఎల్‌ఎంఎస్, డిజిటల్ పాఠాలను అప్‌లోడ్ చేశారు. సరికొత్త సమాచార సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకొని తరగతి గదిలో హై డెఫినేషన్ విజువల్స్–టచ్ సపోర్టెడ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయంతో బోధన సులువవుతుంది. ఈ బోర్డులను టీవీగా డిజిటల్ బోధనకే కాకుండా టచ్–స్టైలిష్ సహకారంతో బ్లాక్ బోర్డుకు ప్రత్యామ్నాయంగా కూడా వినియోగించుకునే అవకాశం ఉంది. విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ దృశ్య రూపంలో చూపెట్టడం వల్ల ప్రత్యక్ష అనుభూతి పొందుతూ నేర్చుకోగలుగుతారు.

**ఐఎఫ్‌పీ ఉపయోగాలు ఇలా ..**

- ఆకట్టుకునేలా బోధన
- ఉపాధ్యాయుడు విద్యార్థులందరినీ దృష్టిలో పెట్టుకొని సులభంగా అర్థం చేయించే అవకాశం ఉంది.
- ప్రొజెక్టర్, కేయాన్లకు ప్రత్యామ్నాయంగా సులువైన ఆపరేషన్
- ఇంటర్నెట్, యూట్యూబ్, విద్యా చానల్స్, పెన్ డ్రైవ్, వాట్సాప్‌లతో కనెక్టివిటీ చేయడం ద్వారా బోధన సులువవుతుంది.
- విద్యార్థులకు దృశ్య మాలికతతో కూడిన అభ్యాసము చేయించవచ్చు.
- ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా చూపించడం,
- అవసరమైనప్పుడు డిజిటల్ పాఠాన్ని ఆపి వైట్ బోర్డు సహాయంతో బోధించే అవకాశం ఉంది.
- బోధన సమయాన్ని ఆదాచేయడం, సరళంగా బోధించడం తదితర ఉపయోగాలున్నాయి.

### ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలి



జిల్లాలో ఐఎఫ్‌పీ బోర్డులు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలి. ఈ మేరకు హెచ్‌ఎంలను ఆదేశించాం. ఇంటర్నెట్‌కు అయ్యే వ్యయం పాఠశాలలకు మంజూరయ్యే మెయింటినెన్స్ గ్రాంట్ నుంచి వాడుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాఠశాలలకు విద్యుత్ బిల్లులు మాఫీ చేసినందున ఆ నిధులను ఇంటర్నెట్‌కు వాడుకోవాలి.

\- వాసంతి, డీఈఓ

### సపోర్టింగ్ మానిటరింగ్ ఉంటుంది

ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేయడానికి ఐఎఫ్‌పీ బోర్డులను వినియోగించుకోవచ్చు. డిజిటల్ బోధనకు సపోర్టింగ్ మానిటరింగ్ కూడా ఉంటుంది. జిల్లాలోని రిసోర్స్ పర్సన్ల ద్వారా ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు వాటి వినియోగంపై అవసరమైన సలహాలు సూచనలు ఇస్తాం. సమర్థవంతంగా హెచ్‌ఎంలు, టీచర్లు వినియోగించుకోవాలి.

\- ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

# కొలువులకు కోత!

**ప్రమోషన్ల కోసం పోస్టుల కుదింపు**

- టీజీ ఎన్పీడీసీఎల్ తీరుతో నిరుద్యోగుల అవకాశాలకు గండి
- సబ్‌స్టేషన్‌లలో ఆపరేటర్లు కరువు
- గ్రామాల్లో జూనియర్ లైన్‌మెన్ల కొరత
- క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ఇబ్బందులు
- పని భారంతో ఏఅండ్ఎం ఉద్యోగుల అవస్థలు



హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెబుతుండగా.. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థ టీజీ ఎన్పీడీసీఎల్ ఇంజనీర్ల పదోన్నతుల కోసం వర్క్‌మెన్ పోస్టులకు కోత పెట్టి నిరుద్యోగుల అవకాశాలు కొల్లగొడుతున్నదనే అపవాదును మూటగట్టుకుంటోంది. వర్క్‌మెన్ పోస్టులను తగ్గించి వాటిని ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించేందుకు ఉన్నత స్థాయి పోస్టులు సృష్టించడంపై క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించినా ఆ మేరకు ఆపరేటర్లను నియమించకపోవడంతోఅందుబాటులో ఉన్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులపై భారం పడుతోందనే వాదన వినిపిస్తోంది. కొన్ని సబ్‌స్టేషన్లలో రిటైర్డ్ ఉద్యోగుల ను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ ని ర్వహణను నెట్టుకొస్తున్నారే తప్ప సబ్‌స్టేషన్ ఆపరేటర్ల నియామకంపై యాజమాన్యం దృష్టి సారించడం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు.

**23 నెలల క్రితం నోటిఫికేషన్**

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 932 పోస్టులు ఖాళీగా ఉండగా 23 నెలల క్రితం 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల 93 పోస్టులు భర్తీ చేశారు. మిగతా 839 పోస్టులు భర్తీ చేయలేదు. వాటిలో 200 పోస్టులకు కోత పెట్టి ఉన్నతస్థాయి పోస్టులుగా సృష్టించి ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు సమాచారం. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది లేక.. ఉన్న ఉద్యోగులపై పని భారం పడుతున్నా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుండడంతో నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు.

**339 కొత్త పోస్టుల స్థిరీకరణ**

కొన్నేళ్లుగా వృథాగా ఉన్న 215 అన్‌యూజ్డ్ పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టుల్లో 200 కలిపి మొత్తం 415 పోస్టుల స్థానంలో కొత్తగా 339 పోస్టులు స్థిరీకరించారు. అందులో చీఫ్ ఇంజనీర్, సీజీఎం(అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ(పీఅండ్‌జీ), జనరల్ మేనేజర్ (పీఅండ్‌జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున, జూనియల్ అకౌంట్స్ ఆఫీసర్ 20, సీనియర్ అసిస్టెంట్ 88, సీనియర్‌లైన్ ఇన్‌స్పెక్టర్ 32, అసిస్టెంట్ లైన్‌మెన్ 48, ఆఫీస్ సబార్డినేట్ 88, స్వీపర్ పోస్టులు ఆరు మార్చినట్లు సమాచారం.


**వంతుల వారీగా విధులు..**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు 994 ఉండగా ప్రస్తుతం 1,511కు పెరిగింది. విద్యుత్ సర్వీసులు 48,17,575 ఉండగా 68,51,012కు పెరిగాయి. ఈ లెక్కన 517 సబ్‌స్టేషన్‌లు, 20,33,437 సర్వీసులు పెరిగాయి. అయితే.. విద్యుత్ వినియోగదారులకు సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది, ఉద్యోగుల నియామకంపై దృష్టి సారించలేదు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు కనీసం నలుగురు ఆపరేటర్లు అవసరం. ఈ లెక్కన కొత్తగా నిర్మించిన 517 సబ్‌స్టేషన్లకు 2,068 మంది కావాలి. అన్ యూజ్డు పోస్టుల స్థానంలో సృష్టించిన కొత్త పోస్టుల్లోనూ సబ్‌స్టేషన్ ఆపరేటర్లను మరిచారు. దీనికి తోడు గతంలో పని చేసిన ఆపరేటర్లు రిటైర్డ్ అవుతుండడంతో ప్రతి నెలా ఖాళీలు ఏర్పడుతున్నాయి. దీంతో జేఎల్‌ఎంలు, ఏఎల్‌ఎంలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు వంతుల వారీగా ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు జూనియర్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీ ఉండడంతో ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ అటెండ్ చేసే వారు కరువయ్యారు.

**వృథాగా 215 పోస్టులు**

ఎన్పీడీసీఎల్ సంస్థలో గన్‌మ్యాన్, టెలిఫోన్ బాయి, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్, టెలిఫోన్ ఆపరేటర్, టూల్ కీపర్ వంటి 215 పోస్టులు ఎన్నో ఏళ్లుగా వృథాగా ఉంటున్నాయి. వీటిని క్షేత్ర స్థాయి వర్క్‌మెన్ పోస్టులుగా మార్చాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు మూడేళ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఇదే అదనుగా పదోన్నతుల కోసం ఇంజనీర్లు ఇందులో ప్రవేశించి తమకు కొన్ని పోస్టులు ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే.. ఈ పోస్టులకు చెల్లించే జీతాల మొత్తం ప్రతిపాదిత పోస్టుల మొత్తానికయ్యే జీతాలకు సరిపోక యాజమాన్యం దృష్టి.. భర్తీ కాకుండా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులపై పడింది.

**పదోన్నతుల కోసం కాదు..**



అన్ యూజ్డు పోస్టులను ఇతర పోస్టులుగా మార్చడం పదోన్నతుల కోసం కాదు. ఎన్పీడీసీఎల్ పరిధి రిమోట్ ఏరియాలో కొత్తగా సెక్షన్లు పెంచాల్సిన అవసరం ఉంది. ములుగు సర్కిల్ ఏర్పాటు చేస్తున్నాం. మరికొన్ని డివిజన్లు, సబ్ డివిజన్లు కొత్తగా ఏర్పాటు చేస్తున్నాం. ఈ కార్యాలయాల్లో పోస్టుల భర్తీకి, వినియోగంలో లేని పోస్టులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. వినియోగదారులకు సేవలు అందించేందుకు, అడ్మినిస్ట్రేషన్ అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. త్వరలో జేఎల్‌ఎం పోస్టులు భర్తీ చేయనున్నం. ఈ నియామకాలతో సబ్‌స్టేషన్ ఆపరేటర్ల కొరత తీరుతుంది. - కర్నాటి వరుణ్ రెడ్డి, సీఎండీ ఎన్పీడీసీఎల్

## శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

**కలెక్టర్ ప్రావీణ్య**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : జిల్లాలో ఈనెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వేయి స్తంభాల దేవాలయం, మడికొండ శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని, మహిళా భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున మహిళా పోలీస్ సిబ్బంది అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. 24 గంటల పాటు పారిశుద్ధ్య పనుల నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేష్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఏసీపీ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 25నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సునీత, సీఐ సతీష్

హన్మకొండ కల్చరల్ : రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో ఈనెల 25 నుంచి మార్చి ఒకటో తేదీవరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని వరంగల్ దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత కోరారు. సోమవారం ఆలయంలో ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సునీత, హనుమకొండ సీఐ సతీష్ పాల్గొని ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. రుద్రేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆయా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం, స్వామివారి కల్యాణానికి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే చండీహోమంలో పాల్గొనడానికి రూ.3,116, స్వామివారి కల్యాణంలో రూ.1,116, అన్నపూజ రూ.5,116, లింగోద్భవ కాలపూజ రూ.12,116, శివరాత్రి ఉత్సవాల్లో ఐదురోజులు జరిగే పూజల్లో పాల్గొనే భక్తులు రూ.21,116 చెల్లించి రశీదు పొందాలని సూచించారు. సీఐ సతీష్ మాట్లాడుతూ ఉత్సవాల్లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, సిబ్బంది ఎల్.మధుకర్, రామకృష్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## వినతులు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శారద

**కలెక్టర్ ప్రావీణ్య**

హన్మకొండ అర్బన్ : ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్లోని సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వినతుల్లో జీడబ్ల్యూఎంసీకి 8, ఆర్డీఓ హనుమకొండ 7, తహసీల్దార్ హసన్‌పర్తి 5, వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

**అర్జీలపై దృష్టి సారించాలి.. : వరంగల్ కలెక్టర్ సత్యశారద**

వరంగల్: ప్రజావాణికి వస్తున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 86 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ 33, వ్యవసాయశాఖ 7, డీఆర్‌డీఓ, జీడబ్ల్యూఎంసీ, ఎంజీఎంకు సంబంధించిన సమస్యలపై 5 చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కోదండరాం వ్యాఖ్యలు సరికాదు

**హెచ్‌ఆర్‌డీఏ, కేఎంసీ జూడాల నిరసన**

ఎంజీఎం : అక్రమంగా వైద్య సేవలు అందించే క్వాక్స్‌కు సర్టిఫికెట్ మంజూరు చేయాలని ప్రొఫెసర్ కోదండరాం చేసిన వ్యాఖ్యలు నకిలీ వైద్యులను ప్రోత్సహించేలా ఉన్నాయి.. తీవ్రంగా ఖండిస్తున్నామని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్(హెచ్‌ఆర్‌డీఏ), కేఎంసీ జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కేఎంసీ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఒక వైపు వేలాది మంది మెడికల్ విద్యార్థులు అధునాతన, నాణ్యమైన వైద్య విద్య కోసం పోరాడుతున్నారని అన్నారు. వైద్య కళాశాలల్లో తగిన బోధనా సిబ్బంది, భవనాలు లేక ఇబ్బందులు పడుతుండగా.. కోదండరాం నకిలీ వైద్యులను ప్రోత్సహించేలా మాట్లాడడం ప్రజా ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. ఆయన తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న హెచ్‌ఆర్‌డీఏ బాధ్యులు, జూడాలు

## క్లుప్తంగా

### ముగిసిన చదరంగం పోటీలు



**వరంగల్ స్పోర్ట్స్:** వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో విజేతగా అల్లాడి శ్రీవాత్సవ్, తర్వాతి స్థానాల్లో మ్యాకల శ్రీకాంత్, తుర్క రాజు, రవీంద్రనాథ్ , తిరుపతిచారి, ఆద్య, సుదీప నిలిచారు. విజేతలకు నిర్వాహకుడు పి. కన్నా సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బి టర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, రజనీకాంత్, శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

### చోరీకి యత్నించిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు



**చిన్నగూడూరు:** మండలంలోని ఉగ్గంపల్లి శివారు దేవోజీతండాలో ఓ ఇంట్లో చోరీకి యత్నించిన కేసులో నిందితుడికి తొర్రూరు మేజిస్ట్రేట్ మట్ట సరిత ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రంపాడు మండలం తేనెపల్లికి చెందిన శివర్ల కోటేశ్ 2023లో దేవోజీతండాకు చెందిన ధర్మసోత్ భూపాల్ నాయక్ ఇంటిలో చోరీకి యత్నించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కోటేశ్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం కేసు విచారణ అనంతరం తొర్రూరు మేజిస్ట్రేట్ మట్ట సరిత.. నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా విధులు నిర్వర్తించిన కోర్టు పీసీ మధును తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్, చిన్నగూడూరు ఎస్సై ఝాన్సీ అభినందించారు.

### రూ.38,720 విలువైన గుట్కాలు స్వాధీనం



**ఖిలా వరంగల్:** అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్న కిరాణా వ్యాపారిపై కేసు నమోదు చేసి రూ. 38,720ల విలువైన ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. వరంగల్ 36వ డివిజన్ చింతల్‌కు చెందిన కిరాణా షాపు నిర్వాహకుడు చిదిరాల సుమన్ అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సోమవారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో షాపుపై దాడి చేశారు. ఇందులో రూ. 38,720 విలువైన గుట్కాప్యాకెట్లు లభించగా స్వాధీనం చేసుకుని సుమన్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆన్‌లైన్.. ఆగమాగం!

## ట్రైన్ పాస్‌లు, పీటీఓలు, లీవ్‌లు ఆన్‌లైన్‌లో మంజూరు

- వినియోగించుకోలేకపోతున్న 70 శాతం మంది రైల్వే కార్మికులు
- ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని విన్నపం
- రైల్వే నాయకులు పట్టించుకోవాలని మొర



**కాజీపేట రూరల్:** ఎన్నో ఏళ్ల ఎందరో త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న రైల్వే కార్మికుల హక్కులు పూర్తి స్థాయిలో కార్మికులు అందుకోలేకపోతున్నారు. ఇప్పటికే రైల్వే కార్మికుల హక్కులు చాలా వరకు కనుమరుగవ్వగా.. కొన్నింటి కోసం ఇప్పటికీ కార్మికులు, నాయకులు ఉద్యమిస్తూనే ఉన్నారు. ఈక్రమంలో కొంత కాలంగా రైల్వే శాఖలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల కనీస హక్కులను ఆన్‌లైన్ చేయడంతో వాటిని సరిగ్గా వినియోగించుకోలేకపోతున్నామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా స్మార్ట్‌ఫోన్ ఆపరేట్ చేయడం తెలియని 70 శాతం మంది రైల్వే కార్మికులు ఆన్‌లైన్‌లో తమ హక్కులను ఎలా వినియోగించుకోవాలో తెలియక ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది.




**రైల్వే కార్మికులకు** తమ కుటుంబసభ్యులతో కలిసి ప్రయాణించేందుకు సంవత్సరానికి మూడు ఉచిత ప్రివిలేజ్ ట్రైన్ పాస్‌లు ఇచ్చేది. అత్యవసర పరిస్థితులున్నప్పుడు, సెలవుల కోసం అర్జీ పెట్టుకుంటే సెలవులు ఇస్తారు. అదేవిధంగా క్యాజువల్ లీవ్ (సీఎల్) మంజూరు, ప్రివిలేజ్ టికెట్ ఆర్డర్ (పీటీఓ) మంజూరు ఇవన్నీ... రైల్వే ఆన్‌లైన్ చేయడం వల్ల చాలా వరకు రైల్వే కార్మికులు తమ హక్కులను పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ సిస్టంలో అప్లయ్, అప్‌లోడ్, ఓటీపీ, ఫార్వర్డ్, డౌన్‌లోడ్ విధానం తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




**ప్రివిలేజ్ పాస్ తీసుకునే విధానం** తెలియక కొందరు కొంత కాలం నుంచి ట్రైన్‌పాస్‌లు తీసుకోవడం లేదని కార్మికులు చెబుతున్నారు ఆన్‌లైన్‌లో ట్రైన్ పాస్ ద్వారా ఒక సారి ప్రయాణం చేస్తే మరొకసారి ప్రయాణం చేసే అవకాశం లేకుండా పోయిందని, గతంలో సంవత్సరానికి మూడు ప్రివిలేజ్ ట్రైన్ పాస్‌లు ఇచ్చేవారని, ఈ పాస్‌లపై ఎన్నిసార్లు అయిన ప్రయాణించే అవకాశం ఉండేదని అంటున్నారు. ముఖ్యంగా కింది స్థాయి గ్రూప్ డీ, నాలుగో తరగతి రైల్వే కార్మికులు గ్యాంగ్‌మెన్లు, గ్యాంగ్ ఉమెన్లు, గేట్‌మెన్లు, కీ మెన్లు, అటెండర్లు, డీజిల్ షెడ్, ఎలక్ట్రిక్‌లోషెడ్, ట్రైన్‌లైటింగ్, సిఅండ్‌డబ్ల్యూ స్టాఫ్, టీటీ మిషన్ స్టాఫ్ తదితర కార్మికులు ఆన్‌లైన్‌లో తమ హక్కులను పొందలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. రిటైర్డ్ రైల్వే వారికి ఇస్తున్న మాదిరిగానే సర్వీస్‌లో ఉన్న వారికి కూడా మ్యాన్యువల్‌గా ఇస్తే ఇబ్బంది ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే ట్రేడ్ యూనియన్ల నాయకులు రైల్వే కార్మికుల కనీస హక్కులను ఆన్‌లైన్‌లో కాకుండా పాత పద్ధతిలో అమలు చేసేలా రైల్వే బోర్డు, జీఎం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఆన్‌లైన్ పాస్‌లు ఎత్తివేయాలి..



కార్మికులు తమ ఇంటిల్లిపాదితో కలిసి ఉచిత ట్రైన్‌పాస్‌తో ప్రయాణించేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ చేయడం వల్ల ఆ అవకాశం లేకుండాపోయింది. అత్యవసర సెలవులకు సీఎల్ కార్డు చూపిస్తే లీవ్ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ సిస్టం లేదు. రైల్వే కార్మికుల ఇబ్బందులు గుర్తించి అధికారులు ఆన్‌లైన్ సిస్టం ఎత్తివేసి మ్యాన్యువల్ అమలు చేస్తే బాగుంటుంది.

**- దేవులపల్లి రాఘవేందర్, తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్**

# పర్యాటకులకు గుడ్‌న్యూస్..

- ఒక్క రోజు పర్యాటక ప్రాంతాల సందర్శన
- టూర్ ఏర్పాటు చేసిన తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ





**హన్మకొండ :** పర్యాటకులను ప్రోత్సహించేందుకు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఒక్క రోజు పర్యాటక ప్రాంతాల సందర్శన టూర్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ ఈ టూర్ ప్యాకేజీ రూపొందించారు. మినీ ఏసీ బస్సులో పర్యాటకులను తీసుకెళ్లేలా టూర్ ప్యాకేజీ తీసుకొచ్చారు. ఈ నెల 20 ఉదయం 8 నుంచి రాత్రి 7.45 గంటల వరకు సాగుతోంది. గురువారం ఉదయం 8 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ నుంచి ఈ పర్యాటక ప్రాంతాల సందర్శన ప్రారంభమవుతుంది. ముందు వేయిస్తంభాల దేవాలయానికి చేరుకుంటారు. 9 గంటలకు వేయి స్తంభాల దేవాలయం నుంచి భద్రకాళి దేవస్థానానికి, ఇక్కడి నుంచి రామప్పకు చేరుకుంటుంది. రామప్పలో మధ్యాహ్న భోజన అనంతరం లక్నవరం నుంచి నేరుగా సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటారు. తేనీరు తీసుకున్న తర్వాత ఖిలావరంగల్‌కు చేరుకుని సౌండ్ లైటింగ్ కార్యక్రమాన్ని వీక్షించడంతో పాటు, ఖిలావరంగల్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరిగి రాత్రి 7.45 గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది. వివరాల కోసం 9010007261 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పర్యాటకాభివృద్ధి సంస్థ ఒక ప్రకటనలో కోరింది. సంస్థ వెబ్ సైట్‌లోనూ వివరాలు పొందుపరిచినట్లు తెలిపింది. చార్జీలు పెద్దలకు రూ.980, పిల్లలకు రూ.790గా నిర్ణయించారు.

# రామప్ప శిల్పకళ సంపద అద్భుతం

- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా

**వెంకటాపురం(ఎం):** రామప్ప శిల్పాకళా సంపద అద్భుతమని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని సందర్శించి రామలింగేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా, ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించిన సమయంలో రామప్ప ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత ప్రస్తుతం రామప్ప ఆలయాన్ని మళ్లీ సందర్శించినట్లు వెల్లడించారు. ఆమె వెంట ఓఎస్‌డీ మహేశ్ భగవత్ గీతె, ములుగు డీఎస్పీ రవీందర్, జైళ్ల శాఖ అధికారులు పాల్గొన్నారు.



డీజీ సౌమ్యమిశ్రాకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

# విన్నపాలకు స్పందనేది..?

- ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా పరిష్కారం కాని సమస్యలు
- గ్రేటర్ గ్రీవెన్స్‌లో ప్రజల అసహనం
- దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ అర్బన్:** ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా సమస్యలు పరిష్కారం కావడం లేదు.. ప్లీజ్ మేడం.. క్షేత్ర స్థాయిలో సందర్శించి తమ బాధలు తెలుసుకోవాలని పలు కాలనీలకు చెందిన ప్రజలు గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను వేడుకున్నారు. బల్దియా కౌన్సిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వరంగల్ గ్రేటర్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులను కమిషనర్ స్వీకరించారు. నగర పరిధిలోని పలు కాలనీల్లో కనీస వసతులు లేవని, ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై మొత్తం 76 అర్జీలు అందాయి. అందులో టౌన్ ప్లానింగ్‌కు 31, ఇంజినీరింగ్ విభాగానికి 22, తాగునీటి సరఫరా 10, ప్రజారోగ్యానికి 7, పన్నుల సెక్షన్ 4, ఉద్యానవన విభాగానికి 2 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

**అర్జీల్లో కొన్ని ఇలా..**

- వడ్డేపల్లి విజయ్‌పాల్ కాలనీలో డ్రెయినేజీలు వ్యర్థాలతో నిండి పోయాయని శ్యామల ప్రభాకర్ ఫిర్యాదు చేశారు.
- 43వ డివిజన్ గణేష్‌నగర్‌లో నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న ఓయో రూమ్‌ను రద్దు చేయాలని సంక్షేమ సంస్థ ప్రతినిధులు వేడుకున్నారు.



గ్రీవెన్స్‌సెల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

- కేయూసీ రోడ్డులోని 3 - 14 - 542/2 వద్ద ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతు చేయాలని కూచన సురేష్ కోరారు.
- మడికొండ వెస్ట్‌సిటీలో 400 కుటుంబాలు నివాసముంటున్నాయని, అక్కడ కనీసం సౌకర్యాలు కల్పించాలని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు.
- 11వ డివిజన్ కాపువాడ రాణా సిద్ధిఖీ ఆస్పత్రి లైన్‌లో సీసీ రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యాల కల్పించాలని కాలనీ ప్రతినిధులు విన్నవించారు.
- హనుమకొండ దీన్‌దయాళ్ కాలనీ 'కుడా' ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్గత డ్రెయినేజీలు పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ నేత మంద కుమార్ మాదిగ ఫిర్యాదు చేశారు.
- నక్కలగుట్ట సునీత రెసిడెన్సీ అపార్టుమెంట్ సెల్లార్‌లో అక్రమంగా నిర్మించిన 4 షెట్టర్లను తొలగించాలని స్థానికులు దరఖాస్తు చేశారు.
- 64వ డివిజన్ మడికొండలో 30 ఫీట్ల రోడ్డును 7 ఫీట్ల మేర ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.
- హంటర్ రోడ్డు ట్యాంక్ బండ్ వద్ద టిఫిన్ సెంటర్లు, ఇతర షాపుల కారణంగా వాహనాల రద్దీ పెరుగుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు.
- కాశిబుగ్గ సాయిగణేష్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.


# తహసీల్దార్ గారూ.. ఏది నిజం?

**కలెక్టర్‌కు సవాల్‌గా మారిన కొత్తపేట సర్వే నంబర్ 73 భూ వివాదం**

- ఒకే సర్వే నంబర్‌లో వింత సమాధానాలతో విచారణపై మరిన్ని అనుమానాలు
- క్షేత్రస్థాయిలో విచారణచేస్తేనే బాధితులకు సరైన న్యాయం



ఎండీ జాఫర్ హుస్సేన్ నుంచి కొనుగోలు చేసిన ఎల్లస్వామి సేల్ డీడ్



అంకేశ్వరపు కొమురయ్య సాదాబైనామా

**సాక్షి, వరంగల్:** జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైన 'అన్న, తమ్ముడు.. ఓ తహసీల్దార్ కథనంపై వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ సాక్షి పత్రికకు ఇచ్చిన 'రిజైండర్' మరెన్నో అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి వరంగల్ మండలం కొత్తపేటలోని సర్వే నంబర్ 73లో ఒక ఎకరం భూమి మహమ్మద్ అఫ్జల్ నుంచి 1998 జనవరి 9న సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశానని మోకాపై వ్యవసాయం సాగు చేసుకుంటున్న అంకేశ్వరపు కొమురయ్య వాదిస్తున్నారు. హైకోర్టు ఇచ్చిన సాదాబైనామా అప్లికేషన్ నంబర్ టీటీఆర్ వోఎస్ 02200340 6759 పరిష్కరించాలంటూ 23614 ఆఫ్ 2024 రిట్ పిటిషన్ ప్రకారం అంకేశ్వరపు కొమురయ్యది సర్వే నంబర్ 73/ఏ/3 అని అందులో ఒక ఎకరం ఒక గుంట భూమి అని.. అది రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టా భూమి అని.. సింపుల్ సేల్ డీడ్ ద్వారా ఎండీ ఖాజా పాషా దగ్గర కొనుగోలు చేశాడని సాక్షికి ఇచ్చిన రిజైండర్‌లో తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. దీంతో అసలు ఈ విచారణ సజావుగా సాగిందా అనే అనుమానాలను రేకెత్తిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం 73/ఏ/3లోని ఒక ఎకరం ఒక గుంట ధరణిలో అంకేశ్వరపు ఎల్ల స్వామి పేరున ఉన్నట్టు నిర్ధారించిన తహసీల్దార్ రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి ఎండీ ఖాజా పాషాదని పేర్కొనడమే ఇప్పుడు ఈ వివాదానికి కేంద్ర బిందువు అవుతోంది. ఇప్పుడు ఇదే అంశం కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు సవాల్‌గా మారిందనే చర్చ కలెక్టరేట్ వర్గాల్లో వినబడుతోంది.

**నిజం తేల్చాలని బాధితుల వేడుకోలు**

వరంగల్ మండలం కొత్తపేటలోని 73/ఏ/3లోని ఒక ఎకరం ఒక గుంట భూమి ధరణిలో అంకేశ్వరపు ఎల్లస్వామి పేరున ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమిని మహమ్మద్ ఖాజాపాషా నుంచి అంకేశ్వరపు కొమురయ్య కొనుగోలు చేశారని తహసీల్దార్ ఇక్బాల్ సాక్షితో పేర్కొన్నారు. ఇది లోతుగా పరిశీలిస్తే ధరణిలో అంకేశ్వరపు ఎల్లస్వామి పేరున పట్టా ఉండడం నిజమే. కానీ ఆ భూమిని మహమ్మద్ అఫ్జల్ సోదరుడైన మహమ్మద్ జాఫర్ హుస్సేన్ ద్వారా డాక్యుమెంట్ నంబర్ 2780/2007తో సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ద్వారా అంకేశ్వరపు ఎల్ల స్వామి పేరు మీదకు మారింది. మహమ్మద్ ఖాజాపాషా నుంచి అంకేశ్వరపు కొమురయ్య కొనుగోలు చేశారని తహసీల్దార్ చెబుతుంటే.. ఎండీ జాఫర్ హుస్సేన్ నుంచి అంకేశ్వరపు ఎల్లస్వామి కొనుగోలు చేసినట్టుగా రెవెన్యూ రికార్డులు చెబుతుండడం గమనార్హం. మరీ ఇందులో ఏది నిజమనేది ఉన్నతాధికారులు తేల్చాలని బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తన పట్టా 73/ఏ/3 క్రయ విక్రయాలు జరగకుండా కోర్టు కేసు ఉందని అప్‌డేట్ చేసినదాన్ని తొలగించాలని అంకేశ్వరపు ఎల్లస్వామి రెవెన్యూ ఉన్నతాధికారులను కోరుతున్నారు. అలాగే తన అన్న కొమురయ్య భూమి కొన్న సమయంలో బై సర్వే నంబర్లు లేవని, రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తే ఇది తెలుస్తుందని చెబుతున్నాడు. సర్వే నంబర్ 73లో 12.6ఎకరాల భూమి ఉండేదని వివరించారు.

## సాక్షి క్లాసిఫైడ్స్

### SERVICES

- హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 8341479342. [WA-7554]

**స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్**

- స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. 8186926067, 8977263124. [W-1264133]

### BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]
- మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

### WANTED

- Urgently required senior faculty in Maths physics chemistry & biology with a minumum of 10yrs of teaching experience in NEET & IIT, JEE Competitive salary asper market standards SHAHEEN JUNIOR COLLEGE mulugu x road HNK. +918374999475 [SCA25001745]

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

| | |
|---|---|
| హన్మకొండ | 9010144453 |
| వరంగల్ | 9705748198 |
| నర్సంపేట | 9553955722 |
| జనగామ | 9951602871 |
| మహబూబాబాద్ | 9010144453 |
| పరకాల | 9010299096 |
| జయశంకర్ భూపాలపల్లి | 9705748198 |

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### స్వాగత తోరణాల పనులు పూర్తి చేయాలి



స్వాగత తోరణం పనులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

**వరంగల్ అర్బన్ :** నగర పరిధి ప్రధాన రహదారుల్లో చేపట్టిన స్వాగత తోరణాల పనులను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. నర్సంపేట రహదారి ధర్మారం వద్ద, ఖమ్మం రోడ్డు పున్నేలు వద్ద నిర్మిస్తున్న స్వాగత తోరణాల అభివృద్ధి పనులను ఆమె సోమవారం సందర్శించారు. వాటిని పర్యవేక్షిస్తున్న ఇంజినీర్లకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- వనమాల కనపర్తిలో ఘటన



రాజేశ్(ఫైల్)

**ఐనవోలు:** అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టు రాజేశ్(41) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం గ్రామంలో ఇంటి నిర్మాణం మొదలు పెట్టాడు. కాగా, చిట్టీలు ఎత్తుకోవడంతోపాటు కొంత మంది వద్ద సుమారు రూ.8లక్షల వరకు అప్పులు చేశాడు. అదే విధంగా భార్య సునీత బంగారం సుమారు 7 తులాల వరకు బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం పొందాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పులు ఎలా తీర్చాలని తరచూ బాధ పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఒక్కడే నిద్రించాడు. సోమవారం ఉదయం భార్య సునీత కొత్త ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాగా, మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఐశ్వర్య, సంజన ఉన్నారు.

### నేడు అగ్రిహబ్ రీజినల్ సెంటర్ ప్రారంభం

**హన్మకొండ:** వరంగల్ మైడిపల్లిలోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన అగ్రిహబ్ రీజినల్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ యూనివర్సిటీ వీసీ ఎ.జానయ్య ప్రారంభిస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయంలో స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించడానికి ఈ అగ్రిహబ్‌ను ఇక్కడ స్థాపించినట్లు వివరించారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు



**గీసుకొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రి, నర్సంపేట జనరల్ ఆస్పత్రి, వరంగల్‌లోని రీజినల్ కంటి ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహించినట్లు వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.సాంబశివరావు తెలిపారు. వరంగల్ జిల్లాలో 36,368మంది విద్యార్థులు ఉండగా అందులో 33,516మందికి కంటి పరీక్షలు( 92.36శాతం) నిర్వహించగా 1,074 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. వీరికి సోమవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు చికిత్స అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ మేరకు వరంగల్ రీజినల్ కంటి ఆస్పత్రిలో 43మంది, నర్సంపేట జనరల్ ఆస్పత్రిలో 32మంది, వర్ధన్నపేట ఏరియా హాస్పిటల్‌లో 20మందికి పరీక్షలు చేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐవో ప్రకాశ్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నిబంధనలు పాటిస్తేనే నిర్మాణ అనుమతులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



హనుమకొండలో భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ అర్బన్ :** భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. నూతన భవన నిర్మాణాలకు అనుమతుల మంజూరు.. పెద్ద భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం ఆమె సోమవారం నగర పరిధి సుబేదారి ప్రాంతంలోని పోస్టల్‌కాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట, లోటస్‌కాలనీ, కాజీపేట ప్రాంతాల్లో పర్యటించి ఫిర్యాదులను, మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టీఎస్-బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసిన నేపథ్యంలో సూచించిన ధ్రువీకరణ పత్రాలు నమోదు చేసి నిబంధనలు పాటిస్తే చట్టానికి లోబడి అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి అనుమతులు ఇవ్వమని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు ఉన్నారు.

### 24 కిలోల గంజాయి స్వాధీనం



దోర్నకల్ : నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**వరంగల్:** వరంగల్ రైల్వేస్టేషన్‌లో హరప్రసాద్ సాహూ అనే వ్యక్తి వద్ద సుమారు రూ.6లక్షల విలువైన 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కోదల గ్రామానికి చెందిన హరప్రసాద్ సాహూ సోమవారం గంజాయితో వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగి క్రయవిక్రయదారుల కోసం వేచి ఉన్నాడు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అతడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

**దోర్నకల్‌లో 19.68 కేజీలు..**

**దోర్నకల్ :** దోర్నకల్ మండలం ఉయ్యాలవాడ క్రాస్ వద్ద సోమవారం పోలీసులు ఎండు గంజాయి పట్టుకున్నారు. ఎస్సై గడ్డం ఉమ కథనం ప్రకారం.. ఉయ్యాలవాడ క్రాస్ వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా 19.68 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో ఒడిశాకు చెందిన సమర భూమియా, సీసీఎల్, మహాదేవ్ మండల, ఉమేశ్ మండలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4,92,000 ఉంటుందని ఎస్సై తెలిపారు.